ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

సోమవారం 18-05-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 337 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

### యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో

## అగ్నిప్రమాదం..!

- యూనిట్-3లో ఒక్కసారిగా ఎగిసిపడ్డ మంటలు
- అప్రమత్తమైన సిబ్బంది.. తప్పిన భారీ ప్రమాదం



నల్గొండ జిల్లా వీర్లపాలెంలోని ప్రతిష్టాత్మక యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3 పరిధిలో ఉన్న టర్బైన్ డ్రైవన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో పాటు అక్కడే ఆయిల్ లీకేజీ కావడంతో మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి.

2 లో

### బండి సంజయ్ కేంద్రమంత్రిగా కొనసాగడం

## దేశానికే అవమానం

### : కేటీఆర్




పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2లో..

## ఢిల్లీకి మంత్రి నారా లోకేష్

### : వరుస సమావేశాలతో బిజీ షెడ్యూల్!



అమరావతి (ఇది కద నిజం) ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరు, పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై చర్చించేందుకు ఆయన ఈ పర్యటన చేపడుతున్నారు. సోమవారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్న లోకేష్.. అక్కడ రెండు రోజుల పాటు అత్యంత బిజీ షెడ్యూల్‌తో గడపనున్నారు.

**కేంద్ర మంత్రులతో కీలక భేటీలు**

ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. ముఖ్యంగా కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రితో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసి ఏపీకి సంబంధించిన పలు ప్రతిపాదనలను వారి ముందుంచనున్నారు.

మిగతా 2లో..

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై భగ్గుమంటున్న వైసిపి

- ఏపీ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు!




తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టాలని ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని ఆరోపిస్తూ.. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు.

**బాదుడే బాదుడు.. ప్రజలపై మోయలేని భారం: సజ్జల మండిపాటు**

వైసిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు మరియు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈ నిరసన ప్రణాళికను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఊరటనివ్వాల్సింది పోయి, ఇంధన ధరలను విపరీతంగా పెంచి భారం మోపుతోందని మండిపడ్డారు. పెరిగిన ఇంధన ధరల ప్రభావం రవాణా రంగం, రైతులు, చిన్న వ్యాపారులపై తీవ్రంగా పడుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2లో..

## మౌనమెందుకు ..?

- నీట్ పేపర్ లీక్ కేసుపై ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్నలు..



రాహుల్ గాంధీ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, నీట్ ప్రశ్నపత్రాల లీక్ ఘటనలపై ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు.

తన పోస్టులో రాహుల్ గాంధీ, "నీట్ 2024లో పేపర్ లీక్ జరిగినా పరీక్షను రద్దు చేయలేదు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయలేదు. సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది, కేంద్రం కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పుడు నీట్ 2026లో కూడా పేపర్ లీక్ జరిగింది. పరీక్ష రద్దు అయింది. అయినా సంబంధిత మంత్రి పదవిలోనే కొనసాగుతున్నారు. మళ్లీ సీబీఐ దర్యాప్తు చేస్తోంది, మరో కమిటీ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు" అని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## ఆర్టీసీలో

# ప్రైవేటీకరణ దుమారం



అమరావతి (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రైవేటీకరణ అంశం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. గత కొన్ని రోజులుగా దీనిపై సాగుతున్న చర్చ.. తాజాగా ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణరావు చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా రాజకీయ రంగు పులుముకుంది. ఈ వ్యవహారంపై అటు కార్మిక సంఘాలు, ఇటు ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**కేవలం కొన్ని బస్సుల గురించే మాట్లాడాను: కొనకల్ల వివరణ**

ఆర్టీసీ ప్రైవేటీకరణపై వస్తున్న విమర్శలపై చైర్మన్ కొనకల్ల నారాయణరావు స్పందించారు. తన వ్యాఖ్యలను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సంస్థను పూర్తిగా ప్రైవేటుపరం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, కేవలం కొన్ని నిర్దిష్టమైన మార్గాల్లో, కొన్ని బస్సుల నిర్వహణ పరంగా మాత్రమే తాను మాట్లాడానని ఆయన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

**ప్రభుత్వ కుట్ర ఇదే.. మండిపడుతున్న యూనియన్లు**

కానీ, చైర్మన్ వివరణపై ఆర్టీసీ కార్మిక సంఘాలు ఏమాత్రం సంతృప్తి చెందడం లేదు. కొన్ని బస్సుల పేరుతో మొదలుపెట్టి, భవిష్యత్తులో మొత్తం సంస్థనే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కుట్ర చేస్తోందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు డిపోల పరిధిలో కార్మికులు నిరసనలకు దిగుతూ, ఆందోళన బాట పట్టారు.

**గట్టిగా ఎదుర్కొంటాం: మాజీ మంత్రి పేర్ని నాని హెచ్చరిక**

ఈ వివాదంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నేత పేర్ని నాని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. ఆర్టీసీని ప్రైవేటు చేసే ప్రతిపాదన గనుక వస్తే ఊరుకునేది లేదని, కార్మికులతో కలిసి వైసిపి రోడ్లపైకి వచ్చి గట్టిగా ఎదుర్కొంటుందని ఆయన హెచ్చరించారు. ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేటు పరం చేయడం అంటే సామాన్యుల నడ్డి విరచడమేనని ఆయన మండిపడ్డారు.

**చంద్రబాబు ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శల బాణాలు**


రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆర్టీసీని నమ్ముకుని వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలు బతుకుతున్నాయని, ప్రభుత్వ నిర్ణయం వల్ల వారి భవిష్యత్తు అంధకారంలో పడుతుందని అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

మిగతా 2లో..

### కేరళ నూతన ముఖ్యమంత్రిగా

## సతీశన్ ప్రమాణ స్వీకారం

### విశిష్ట అతిథిగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి!



తిరువనంతపురం: కేరళ రాష్ట్రంలో సరికొత్త రాజకీయ శకం ప్రారంభం కాబోతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా సీనియర్ నేత వి.డి. సతీశన్ సోమవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ముఖ్యఅతిథిగా హాజరై, సతీశన్‌తో పాటు పలువురు నూతన మంత్రులచే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

2 లో

## రైతు హామీలు

## ఎక్కడ వేసిన గొంగడి అక్కడే..



రాష్ట్ర ప్రభుత్వ హామీలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రైతుల విషయంలో ధాన్యం కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని విమర్శించారు. తాజాగా నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. రుణమాఫీ విషయంలో చాలా మంది రైతులు బ్యాంకుల్లో డిఫల్టర్లుగా మారారని.. రైతులు అనేక ప్రాంతాల్లో రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. రైతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అండగా ఉన్నా.. ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందుతుందో అర్థం కావడం లేదన్నారు.. యూపీఏ హయాం కంటే ధాన్యం గిట్టుబాటు ధరను కేంద్రం పెంచిందని చెప్పారు. అయినా కూడా కొనుగోలు విషయంలో ఎందుకు విఫలం అవుతున్నారో తెలియడం లేదని.. మంత్రులు కౌంటర్ల ఇవ్వడం పైనే పనిచేస్తున్నారు తప్పా కొనుగోలు విషయంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. మద్దతు ధర పెంచి బోనస్ ఇస్తామని అన్నారు.. ఆ తరువాత సన్న వడ్లకు మాత్రమే అన్నారని గుర్తు చేశారు. ఆరుగాలం పండించి తెచ్చి కళ్ళల్లో పెడితే కొనే దిక్కులేదని అసహనం వ్యక్తం చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం



# ఆర్టీసీలో ప్రైవేటీకరణ దుమారం

మొదటి పేజీ తరువాయి

ప్రైవేటీకరణ వద్దు.. విలీనాన్ని కొనసాగించాలి

గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన విషయాన్ని ఈ సందర్భంగా కార్మిక నేతలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం అంటే ఉద్యోగుల హక్కులను కాలరాయడమేనని వాపోతున్నారు. విలీన ప్రక్రియను యథాతథంగా కొనసాగిస్తూ, సంస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణికులపై భారం పడే అవకాశం?

ఒకవేళ ఆర్టీసీలో ప్రైవేట్ శక్తుల ప్రవేశం జరిగితే, చార్జీల నియంత్రణ ప్రభుత్వం చేతుల్లో ఉండదని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు రవాణా సదుపాయాలు తగ్గిపోయే ప్రమాదం కూడా ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉత్కంఠ రేపుతున్న తదుపరి పరిణామాలు

ప్రస్తుతానికి ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అటు కార్మికులు సమ్మెకు సైతం వెనకాడబోమని హెచ్చరిస్తుండటంతో రాష్ట్రంలో ఉత్కంఠ నెలకొంది. మరి ఈ వివాదానికి తెరదించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, ప్రభుత్వం దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేస్తుందో వేచి చూడాలి.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై భగ్గుమంటున్న వైసిపి

నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు.. అధికారులకు వినతిపత్రాలు

మొదటి పేజీ తరువాయి

సోమవారం ఉదయం నుంచే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైసిపి శ్రేణులు, అనుబంధ సంఘాల నేతలు రోడ్లపైకి వచ్చి వినూత్న రీతిలో నిరసనలు తెలపనున్నారు. ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించిన అనంతరం.. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, తాసిల్దార్లకు వినతిపత్రాలు సమర్పించనున్నారు. ఈ ప్రజాపోరాటంలో సామాన్య ప్రజలు, ప్రజాసంఘాలు కూడా కలిసిరావాలని వైసిపి పిలుపునిచ్చింది.

నాడు హామీలు ఇచ్చి.. నేడు మాట తప్పారు: ప్రతిపక్షం విమర్శలు

గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలపై నాడు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పెద్ద ఎత్తున విమర్శలు చేశారని, తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని నమ్మబలికారని వైసిపి నేతలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన ధరలను తగ్గించే వరకు తమ పోరాటం ఆగేది లేదని వైసిపి స్పష్టం చేసింది.

# రైతు హామీలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే.. ధాన్యం కొనుగోళ్లపై కేంద్ర మంత్రి ఫైర్..

మొదటి పేజీ తరువాయి

బస్తాలు, సుతిలి దారం నుంచి అన్ని కేంద్రం అందిస్తుందని చెప్పారు. నిల్వ కేంద్రాల ఖర్చు కూడా కేంద్రమే ఇస్తుందన్నారు.

అయినా కూడా కొనుగోలు ఎందుకు జరగడం లేదో ప్రభుత్వం చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.. "ప్రతి కేజీకి 40 రూపాయలు కేంద్రమే ఇస్తుంది. మళ్ళీ పేద ప్రజలకు కేంద్రం అవే బియ్యం రేషన్‌పై ఇస్తుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 5 కేజీల బియ్యం కేంద్రం ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నామని చెబుతున్న సన్న బియ్యంలో కూడా 60 నుంచి 65 శాతం కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది.. ఇది నిజం కాదని చెప్పాగలరా..? ఉచితంగా ఒక్కొక్కరికీ 5 కేజీల బియ్యం ఇస్తున్న ఘనత మన కేంద్ర ప్రభుత్వందే. ప్రతీ రైతుకి పత్తి మీద లాభం కలిగేలా కేంద్రం చర్యలు చేపట్టింది. వడ్లతో పాటు పత్తి కూడా తెలంగాణాలో ఉత్పత్తి వస్తుందని ప్రధాని చెప్పారు. ఈ రెండు పంటల రైతులను ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యత. ప్రతి చివరి కేజీ వరకు పత్తి కొనే బాధ్యత కేంద్రం తీసుకుంటుంది. రాష్ట్ర మంత్రులు ఒక్కొక్కరు ఒక్కో జిల్లాకు వెళ్ళండి. అక్కడ ఎందుకు కొనుగోలు జరగడం లేదు తెలుసుకోండి. కేవలం హైదరాబాద్ లో కూర్చొని ప్రెస్ మీట్ పెట్టడం కాదు. రైతుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించండి. కేంద్ర ప్రభుత్వం అనేక విధాలుగా రైతులను ఆదుకుంటుంది. యూరియా 220 రూపాయలకు సబ్సిడీలో అందిస్తుంది. ఫసల్ భీమా యోజన ద్వారా దేశ రైతులకు అండగా నిలిచింది కేంద్రం. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల విషయంలో అండగా వ్యవహరించాలి." అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు.

# ఢిల్లీకి మంత్రి నారా లోకేష్

## : వరుస సమావేశాలతో బిజీ షెడ్యూల్!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఐటీ రంగ విస్తరణకు కేంద్రం నుంచి అందాల్సిన సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించడంతో పాటు, ఏపీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన విద్యా సంస్థల నిధుల విడుదలపై కూడా కేంద్ర పెద్దలతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడనున్నారు.

ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా పారిశ్రామికవేత్తలతో సమావేశాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏపీలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్న లోకేష్.. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో భేటీ కానున్నారు. ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వారికి వివరించి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించనున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ రంగాలకు చెందిన కంపెనీలను రాష్ట్రానికి రప్పించేందుకు ఈ సమావేశాలలో గట్టిగా ప్రయత్నించనున్నట్లు సమాచారం.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం..!

మొదటి పేజీ తరువాయి

అయితే, ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన ప్లాంట్ అధికారులు, సాంకేతిక సిబ్బంది , అగ్నిమాపక సిబ్బంది యుద్ధప్రతిపాదికన స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ఒక పెద్ద పెను ప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు, ప్రాణనష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈ అగ్నిప్రమాదం కారణంగా ప్లాంట్‌లోని కంట్రోల్ కేబుల్స్‌తో పాటు వాల్వ్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. అయితే, ఈ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదాలు జరగడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది మే నెలలో కూడా ఇక్కడి యూనిట్-1లో ఇలాగే అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మరీ ముఖ్యంగా, ఈ యూనిట్-3లో కొద్ది రోజుల క్రితమే అనధికారికంగా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే మళ్లీ ఇలాంటి ప్రమాదం జరగడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అధికారులు మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో దట్టంగా అలుముకున్న పొగలు క్లియర్ అయిన తర్వాత, క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను విశ్లేషించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక సమర్పించనున్నారు.

# కేరళ నూతన ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణ స్వీకారం

మొదటి పేజీ తరువాయి

అతిథులుగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సీనియర్ నేతలు

ఈ చారిత్రాత్మక ఘట్టానికి కాంగ్రెస్ హైకమాండ్ పెద్దలతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు హాజరవుతున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రత్యేకంగా హాజరుకానున్నారు. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించడమే కాకుండా, అక్కడ కాంగ్రెస్ కూటమి విజయం సాధించడంలో తనదైన ముద్ర వేశారు. రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణకు చెందిన పలువురు మంత్రులు, ఏఐసీసీ సీనియర్ నేతలు కూడా ఈ వేడుకకు తరలివెళ్లారు.

ఎల్డీఎఫ్ పదేళ్ల పాలనకు బ్రేక్.. యూడీఎఫ్ క్లీన్ స్వీప్

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అఖండ విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 140 స్థానాలు ఉన్న కేరళ అసెంబ్లీలో యూడీఎఫ్ కూటమి ఏకంగా 102 సీట్లను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. తద్వారా గత పదేళ్లుగా అధికారంలో ఉన్న సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి కేరళ ఓటర్లు చెక్ పెట్టారు. ప్రజా వ్యతిరేకత, అవినీతి ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొడుతూ ప్రతిపక్ష నేతగా ఉన్న వి.డి. సతీశన్ క్షేత్రస్థాయిలో పార్టీని నడిపించిన తీరు కాంగ్రెస్‌కు ఈ భారీ విజయాన్ని తెచ్చిపెట్టింది.

కేరళ ప్రగతిపై సతీశన్ నూతన ముద్ర

ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన 61 ఏళ్ల వి.డి. సతీశన్, కేరళ రాజకీయాల్లో క్లీన్ ఇమేజ్ ఉన్న నేతగా గుర్తింపు పొందారు. ప్రమాణ స్వీకారానికి ముందే ఆయన కూటమిలోని మిత్రపక్షాలైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తదితర పార్టీలతో విస్తృతంగా చర్చలు జరిపి, సామాజిక, ప్రాంతీయ సమీకరణాల ఆధారంగా 20 మందితో కూడిన మంత్రివర్గ జాబితాను సిద్ధం చేశారు. కేరళను విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్తామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని సతీశన్ స్పష్టం చేశారు.

# బండి సంజయ్ కేంద్రమంత్రిగా కొనసాగడం దేశానికే అవమానం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్రమంత్రి సంజయ్‌పై ఆయన నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు.

ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు.

# మౌనమెందుకు ..?

మొదటి పేజీ తరువాయి

అదే సమయంలో ప్రధాని మోదీని ఉద్దేశించి ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. "పరీక్షా పత్రాల లీక్ ఘటనలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయి? ఈ అంశంపై మీరు ఎందుకు మౌనం పాటిస్తున్నారు? వరుసగా విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?" అంటూ ప్రశ్నించారు.

నీట్ పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతున్న సమయంలో రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.


# సుప్రీంకోర్టు జడ్జీల పెంపునకు రాష్ట్రపతి గ్రీన్ సిగ్నల్



న్యూస్ డెస్క్, 17 మే (ఇది కద నిజం): సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, సత్వర న్యాయం అందించే లక్ష్యంతో అత్యున్నత న్యాయస్థానం న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన ప్రతిపాదనకు అనుగుణంగా, రాష్ట్రపతి 'సుప్రీంకోర్టు సవరణ ఆర్డినెన్స్, 2026'ను జారీ చేశారు. ఈ నిర్ణయంతో సుప్రీంకోర్టు మంజూరైన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య (చీఫ్ జస్టిస్‌తో కలిపి) ప్రస్తుతం ఉన్న 34 నుండి 38కి పెరగనుంది. అంటే ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) మినహా మిగిలిన జడ్జీల సంఖ్య 33 నుండి 37కి పెరుగుతుంది.

ప్రస్తుతం సుప్రీంకోర్టులో దాదాపు 92,000 కంటే ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(1) ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. అయితే, అత్యవసర ప్రాధాన్యత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం మొదట ఆర్డినెన్స్ మార్గాన్ని ఎంచుకుంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన ఈ ఆర్డినెన్స్‌ను రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు రూపంలో ప్రవేశపెట్టి, ఉభయ సభల ఆమోదంతో పూర్తిస్థాయి చట్టంగా మార్చనున్నారు. సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్యను పెంచడం 2019 తర్వాత ఇదే మొదటిసారి.

# సర్కారుపై నమ్మకంరాష్ట్రంలో పెరిగిన మద్యం అమ్మకాలు



**న్యూస్ డెస్క్, 17 మే (ఇది కద నిజం):** కోరుకున్న బ్రాండ్లు, అందులోనూ నాణ్యమైన మద్యం..అక్రమ రవాణా కట్టడి..ఎక్సైజు శాఖలో అవినీతికి అడ్డుకట్టతో రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఎక్సైజ్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తూ పారదర్శకత, నాణ్యత, టెక్నాలజీ ఆధారిత విధానాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయడంతో ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత 23 నెలల్లో ఎక్సైజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే ఇందుకు కారణమని ఎక్సైజు శాఖ చెబుతోంది.

గత ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అనుమానాలు నెలకొన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కల్తీ మద్యం, అక్రమాలు, నగదు లావాదేవీలు వ్యవస్థను దెబ్బతీశాయని ప్రభుత్వం విమర్శించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్సైజ్ శాఖ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం చంద్రబాబు... స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను రద్దు చేసి ఎక్సైజు శాఖను ఏకీకృతం చేయడంతో పాటు మద్యం కుంభకోణాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది.

కొత్త ఎక్సైజ్ పాలసీ..

చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2024-26 నూతన మద్యం విధానంలో భాగంగా లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపుల కేటాయింపు చేపట్టగా దాదాపు 90 వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి రూ.1800 కోట్ల ఆదాయం సమకూరింది.

మరో వైపు ఎన్నికల హామీ మేరకు 10 శాతం దుకాణాలు కల్లుగీత కార్మికులకు కేటాయించారు.

డిజిటల్ చెల్లింపులకు ప్రోత్సాహం..

మద్యం విక్రయాల్లో పారదర్శకత పెంచేందుకు డిజిటల్ చెల్లింపులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ చర్యతో గతంలో కేవలం 0.6 శాతం మాత్రమే ఉన్న డిజిటల్ లావాదేవీలు ప్రస్తుతం 45 శాతానికి చేరాయి. ట్రాక్ అండ్ ట్రేస్ విధానంతో డిస్టిలరీల నుంచి షాపుల వరకు ప్రతి మద్యం బాటిల్‌ను ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షణ చేస్తోంది. ఇందులో భాగంగా వినియోగదారులు బాటిల్ వివరాలు తెలుసుకునేందుకు ' సురక్ష' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

13 రకాల నిర్ధారణ పరీక్షలు..

రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, చిత్తూరు, కర్నూలులో అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ప్రతి మద్యం బ్యాచ్‌పై 13 రకాల పరీక్షలను ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తోంది. గతంలో ఏటా 14 వేల పరీక్షలు మాత్రమే జరిగేవి. ప్రస్తుతం నెలకు సగటున 30 వేల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

రూ.99కే మద్యం..

అక్రమ రవాణా, నాటు సారా నియంత్రణ కోసం ప్రీమియం బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రూ.99 మద్యం బ్రాండ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లకు అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రంలో పదకొండు ప్రీమియం స్టోర్లు ఏర్పాటు చేశారు.

ఈగిల్ టీమ్స్ ఏర్పాటు..

గంజాయి నిర్మూలన కోసం 'ఈగిల్ టీమ్స్' ఏర్పాటు చేశారు. ఇందుకోసం మద్యం ఆదాయం లో 2 శాతం నిధులను ప్రత్యేకంగా కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలను 'ఎక్సైజ్ ఐ' యాప్‌తో అనుసంధానం చేసి పర్యవేక్షణను కట్టుదిట్టం చేశారు.

గత ప్రభుత్వంలో అనేక లోపాలు..

గత ప్రభుత్వ హయాంలో నాణ్యమైన బ్రాండ్లను తొలగించి వినియోగదారులపై బలవంతపు బ్రాండ్ వ్యవస్థను మోపినట్లు ప్రభుత్వం ఆరోపించింది. నగదు లావాదేవీల ద్వారానే ఎక్కువగా విక్రయాలు జరిగాయని, అక్రమ రవాణా పెరిగిందని విమర్శించింది. మద్యం విధానాల కారణంగా మహిళలపై వేధింపులు, కాలేయం, కిడ్నీ సమస్యలు పెరిగినట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలను ప్రభుత్వం ప్రస్తావించింది.

ప్రజారోగ్యానికి పెద్దపీట..

రాష్ట్రంలో ఎక్సైజ్ వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత, ప్రజారోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రతి దశలో మద్యం నాణ్యతను పరీక్షిస్తున్నామని, బ్రాండ్ మిక్సింగ్, అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. డిజిటల్ లావాదేవీలు పెరగడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

# ఎబోలాతో 88 మంది మృతి..

## గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్ఓ



న్యూస్ డెస్క్, 17 మే (ఇది కద నిజం): ఎబోలా వైరస్ విజృంభణ ఆఫ్రికా ఖండంలో విపరీతంగా మారడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కాంగో , ఉగాండా దేశాల్లో ఎబోలా కేసులు వేగంగా పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యాప్తిని అదుపు చేసేందుకు, ప్రపంచ దేశాలను అప్రమత్తం చేసేందుకు దీనిని 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ' (అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి) గా ప్రకటిస్తూ డబ్ల్యూహెచ్ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

కాంగో, ఉగాండా దేశాలలో ఇప్పటివరకు 300కు పైగా అనుమానిత ఎబోలా కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ బారినపడి ఇప్పటివరకు 88 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కాంగోలో మొదలైన ఈ వైరస్ సరిహద్దులు దాటి పొరుగు దేశమైన ఉగాండాకు కూడా వేగంగా విస్తరించింది. అంతర్జాతీయ ప్రయాణాలు, సరిహద్దుల ద్వారా ఇది ఇతర దేశాలకు వ్యాపించకుండా నిరోధించేందుకు అత్యవసర చర్యలు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే డబ్ల్యూహెచ్ఓ అంతర్జాతీయ నిపుణుల కమిటీ సమావేశమై ప్రస్తుత పరిస్థితులను సమీక్షించిన అనంతరం.. దీనిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్' గా ప్రకటించింది. దీనివల్ల బాధింత దేశాలకు అంతర్జాతీయ నిధులు, వ్యాక్సిన్లు, వైద్య సహాయం వేగంగా అందుతాయి.

వైరస్ లక్షణాలు

ఎబోలా అనేది అత్యంత ప్రమాదకరమైన వైరస్. ఇది సోకిన వారిలో తీవ్రమైన జ్వరం, ఒంటి నొప్పులు, వాంతులు, విరేచనాలతో పాటు అంతర్గతంగా, బాహ్యంగా రక్తస్రావం జరుగుతుంది. ఇది సోకిన రోగుల శరీర ద్రవాల (రక్తం, లాలాజలం వంటివి) ద్వారా ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తుంది. ఈ వైరస్ బారిన పడిన వారు సరైన చికిత్స తీసుకోకుంటే రోజుల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తుంది.

# సిల్టు తీయకపోతే డ్రైనేజీ నీరు రోడ్లపాలే

### అధికారులను అప్రమత్తం చేసిన బిజెపి నేత మల్లారెడ్డి




ఇది కద నిజం, అత్తాపూర్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రాంతాలలోని మ్యాన్ హోల్ లలో సిల్టును వెంటనే పూడికతీత తీయాలని బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి డిమాండ్ చేశారు. హైదర్ గూడ ప్రజల విజ్ఞప్తి మేరకు, మరికొద్ది రోజుల్లోనే వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డ్రైనేజీ మ్యాన్ హోల్ లలో నిండి ఉన్న వ్యర్థాలను, సిల్టును తొలగించే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. పూడికతీత తీయకపోతే వర్షపు నీరు, డ్రైనేజీ నీళ్లన్నీ రోడ్లమీద ప్రవహించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి, వారి సిబ్బందిని పిలిపించి ఏయిర్ టెక్ మెషిన్ మరియు బకెట్ ల సహాయంతో మ్యాన్ హోల్ లలో పేరుకుపోయిన ఇసుకను, వ్యర్థాలను నారగూడెం మల్లారెడ్డి స్వయంగా దగ్గరుండి తీయించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకులారం కృష్ణ కిట్టు, హైదర్ గూడ బస్తీ వాసులు మల్గారి బాలకృష్ణారెడ్డి, మల్గారి కొండల్ రెడ్డి, చెట్టిగారి సతీష్, మరియు సిబ్బంది నర్సింగ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ & హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం




ఇది కద నిజం,హైదరాబాద్, మే 16, 2026: డాక్టర్ నారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 79వ సేవా కార్యక్రమంగా సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో, ఈూా మరియు స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ మరియు హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన, కంటి పరీక్షలు, దంత పరీక్షలు మరియు సాధారణ వైద్య సేవలు అందించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్ర వైద్య నిపుణులు డా. కుషాల్ హిప్పల్గాంకర్ (కిమ్స్ సన్షైన్ ) ముఖ్య అతిథిగా పాల్గొని సేవలు అందించారు. అలాగే డా. రాజశ్రీ రెడ్డి, డా. ప్రవళిక, డా. కిరణ్ డెంటల్, అభినవ్ ఐ కేర్‌కు చెందిన డా. వేణుగోపాల్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సాయి కుమార్ (కిమ్స్ బేగంపేట్ మార్కెటింగ్ టీమ్) మరియు సంధ్యకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందించడం మరియు ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించడం లక్ష్యంగా డాక్టర్ నారి చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, క్రీడాకారులు, వాలంటీర్లు మరియు వైద్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.



## మృతుని కుటుంబ సభ్యుల పరామర్శ

### ఆదుకుంటామని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ హామీ



ఇది కద నిజం,సీతాఫలమండీ : ఇటీవల సీతాఫలమండీ ప్రాంతంలో దారుణ హత్యకు గురైన యువన్ అలియాస్ అఖిల్ కుటుంబసభ్యులను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదివారం పరామర్శించారు. నామలాగుండు లోని వారి నివాసానికి వెళ్ళి తల్లిదండ్రులు దుర్గ, శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. హత్య సంఘటన దురదృష్టకరమని, తనను తీవ్రంగా కలచివేసిందని పద్మారావు గౌడ్ తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని, నేరానికి పాల్పడిన వారికి తగిన శిక్ష పడేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. పోలీసు అధికారులతో టెలిఫోన్ ద్వారా సంప్రదించి కేసు పురోగతిని ఆరా తీయడంతో పాటు నిందితులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా ఆదేశించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అన్ని వేళలా తాము అండగా నిలుస్తామని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# యాదగిరిగుట్టలో ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్



ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈరోజు ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఐదుగురు వాహనదారులు పట్టుబడ్డారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, వారిని నిలిపివేసి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఐదుగురు వాహనదారులపై కేసులు నమోదు చేసి, వారిని కోర్టులో హాజరుపరచడానికి అవసరమైన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ యలగొండ కృష్ణ, ఎస్సైలు దేవేందర్, రాజు, అలాగే కానిస్టేబుళ్లు కోటి, నితిన్, శ్రీనివాస్ రెడ్డి, సైదులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

### కిటకిటలాడిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం



ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడం, దానికి తోడు ఆదివారం సెలవు రోజు కూడా కలిసి రావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తుల సందడితో విపరీతమైన రద్దీ నెలకొంది. భక్తుల తాకిడి పెరగడంతో స్వామివారి ఉచిత సర్వదర్శనానికి దాదాపు మూడు గంటల సమయం పడుతుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంటన్నర సమయం పడుతోంది.

భక్తులు ఆలయంలో జరిగే నిత్య పూజలు, ఆర్జిత సేవల్లో పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయ పరిసరాలతో పాటు స్వామివారి నిత్య కల్యాణ వేదిక, లడ్డు ప్రసాద విక్రయ కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అలాగే కొండక్రింద ఉన్న కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, మరియు వాహనాల పార్కింగ్ స్థలాలు జనసందోహంగా మారాయి. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు వద్ద వాహనాలు భారీగా బారులు తీరాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు పర్యవేక్షించారు.



# రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం.. రెండు బోగీలకు అంటుకున్న మంటలు



**న్యూస్ డెస్క్, 17 మే (ఇది కద నిజం):** ఆదివారం తెల్లవారుజామున రాజస్థాన్‌లోని కోటా రైల్వే స్టేషన్ పరిధిలో భారీ రైలు ప్రమాదం తప్పింది. తిరువనంతపురం నుండి ఢిల్లీ వెళ్తున్న 'రాజధాని ఎక్స్‌ప్రెస్' రైలులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఒక బోగీలో మొదలైన మంటలు క్షణాల వ్యవధిలోనే పక్కనే ఉన్న మరో బోగీకి కూడా వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాద సంకేతాన్ని గమనించిన లోకో పైలట్, రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై రైలును నిలిపివేశారు. హుటాహుటిన రంగంలోకి దిగిన రైల్వే సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి, మంటలు వ్యాపించిన ఆ రెండు బోగీలను మిగతా రైలు నుంచి వేరు చేయడంతో ఒక భారీ విపత్తు తప్పింది.

ప్రాథమిక సమాచారం ప్రకారం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. రైల్వే అధికారులు, ప్రయాణికులు సకాలంలో స్పందించి సురక్షితంగా బయటకు రావడంతో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ టెండర్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. అయితే, ఈ ప్రమాదం కారణంగా కోటా రైల్వే సెక్షన్‌లో ఓవర్ హెడ్ విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో ఆ రూట్‌లో నడిచే పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## యాదగిరిగుట్ట వేద పాఠశాల భూమి పూజకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం



ఇది కద నిజం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నందు ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన వేద పాఠశాల భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవస్థానం తరపున అధికారికంగా ఆహ్వానించారు. ఈ నెల 23 (23-05-2026)న యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ ప్రాంగణంలో శ్రీ కంచి పీఠాధిపతుల వారి దివ్య మంగళ శాసనములతో ఈ భూమి పూజ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖ, భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యల ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీమతి శైలజ రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ వి. హనుమంతరావు, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి భవాని శంకర్ ముఖ్యమంత్రిని వారి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనం పలికారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ముఖ్యమంత్రికి శ్రీ స్వామివారి లడ్డు ప్రసాదాన్ని బహూకరించారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.ఎన్. భాస్కర్ నరసింహమూర్తి, దేవస్థాన ప్రధాన అర్చకులు కాందూరి వెంకటాచార్యులు, శివాలయం ప్రధాన అర్చకులు గౌరీభట్ల నరసింహ రాములు మరియు ఆలయ వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# అమలాశరత్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థినుల అద్భుత నృత్య ప్రదర్శన.



ఇది కద నిజం:తిలక్ రోడ్ లోని అబిడ్స్ వద్ద ఆదర్శ కళానిలయం లో తాళ్లపాక అన్నమయ్యాచార్య 618వ జయంతి ఉత్సవాల్లో ఆకట్టుకున్న "నారీ శక్తి" నృత్య ప్రదర్శన. తాళ్లపాక అన్నమయ్యాచార్య 618వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన "సంగీత నృత్య నీరాజనం" కార్యక్రమంలో ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో అమలాశరత్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థినులు అద్భుత నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. గురువు శ్రీమతి అమల కొండూరు (అమలాశరత్ గారు) శిక్షణలో "నారీ శక్తి -- ద్రౌపది వస్త్రాపహరణం" అనే అంశంపై విద్యార్థినులు భావప్రధాన నృత్యాన్ని ప్రదర్శించారు. మహిళా శక్తి, ఆత్మగౌరవం మరియు ధర్మ పరిరక్షణను ప్రతిబింబించే ఈ ప్రదర్శన ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో నక్షత్ర, మాన్వి, నితీష, సువర్ణ, శ్రావణి, శ్రీనిధి, తారిణి, మహాలక్ష్మి పాల్గొని తమ నృత్య ప్రతిభను చాటుకున్నారు. సుమారు 5 నిమిషాలు 40 సెకండ్ల పాటు సాగిన ఈ నృత్య రూపకం సభికులను ఆకట్టుకుంది. కళ, సంస్కృతి పరిరక్షణలో భాగంగా యువతలో భారతీయ సంప్రదాయ నృత్యాలపై ఆసక్తి పెంపొందించేందుకు అమలాశరత్ ఆర్ట్స్ అకాడమీ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.




# ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో స్వర్ణయుగం




అమరావతి (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక చిత్రపటంపై అగ్రగామిగా నిలపాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పర్యావరణ శ్రద్ధ, పర్యాటక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ సమర్థవంతమైన నాయకత్వంలో ఏపీ పర్యాటక రంగం 2024-26 మధ్యకాలంలో ఒక అపూర్వమైన "స్వర్ణ యుగాన్ని" ఆవిష్కరించింది. 2024 జూన్ నుండి నేటి వరకు పర్యాటక శాఖ సాధించిన విజయాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త జవజీవాలను అందించడమే కాకుండా, ప్రజలు ఆరోగ్యంగా, సంపన్నంగా, సంతోషంగా ఉండాలన్న ప్రభుత్వ ధ్యేయానికి ఇంధనంగా మారుతున్నాయి. పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాటల శ్రమ, పర్యాటక శాఖ బృందం చొరవతో ఏపీ టూరిజం నేడు దేశీయంగా, అంతర్జాతీయంగా ఒక 'సక్సెస్ స్టోరీ'గా నిలిచింది. ఈ విజయ పథం మీద ఒక ప్రకటన విడుదల చేశారు.

**విప్లవాత్మక విధాన నిర్ణయాలు -- పారిశ్రామిక హోదా**


నాడు హైటెక్ సిటీతో ఐటీని పరిచయం చేసిన విజనరీ సీఎం చంద్రబాబు నాయుడు నేడు రాష్ట్రాన్ని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చేందుకు అత్యంత ప్రగతిశీల 'టూరిజం పాలసీ 2024--29'ని తీసుకువచ్చారు. రాబోయే ఐదేళ్ల కాలానికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌తో సరికొత్త పర్యాటక విధానాన్ని ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యం. దీనికి తోడు పర్యాటక రంగానికి "పరిశ్రమ హోదా" కల్పించి.. ఇన్వెస్టర్లకు క్యాపిటల్ సబ్సిడీలు, ఎస్ జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంప్ డ్యూటీ మినహాయింపు వంటి రాయితీలను అందిస్తున్నారు. భారతదేశంలోనే తొలిసారిగా 'టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025'ను ప్రవేశపెట్టి పారదర్శక పద్ధతిలో భూ కేటాయింపులు చేస్తూ భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేశారు. అదే విధంగా క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే మరియు బిఅండ్‌బి విధానాల ద్వారా పర్యాటక అనుభవాలను విస్తృతం చేశారు.

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ జాతీయ, అంతర్జాతీయ పర్యటనలు, రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ల ఫలితంగా పర్యాటక రంగంలో పెట్టుబడుల వరద పారుతోంది. ఈ క్రమంలో కేవలం 22 నెలల కాలంలో రూ. 20,088 కోట్ల విలువైన 117 ప్రాజెక్టులకు సంబంధించి ఎంఓయూలు కుదుర్చుకోగా, వీటి ద్వారా 1,22,637 మందికి ఉపాధి లభించనుంది. తాజ్, మారియట్, ఐటీసీ, హయత్, ఒబెరాయ్, మేఫెర్, హిల్టన్ వంటి 14 అంతర్జాతీయ బ్రాండ్లు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటి ద్వారా కొత్తగా 7,770 హోటల్ గదులు అందుబాటులోకి రానున్నాయి. MICE (సమావేశాలు, ప్రదర్శనలు) కేంద్రంగా అమరావతి, విశాఖపట్నం, తిరుపతి నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.




# డేవిడ్ రెడ్డి టీజర్

## విడుదల తేదీ వచ్చేసింది




మంచు మనోజ్ ప్రస్తుతం దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్న డేవిడ్ రెడ్డి చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆయనకు జోడిగా మారియా రియాబోషప్క కనిపించనుంది. హనుమ రెడ్డి యక్కంటి ఈ చిత్రంతోనే దర్శకుడిగా తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. కొంతకాలం క్రితమే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాగా ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. తాజాగా ఈ మూవీ బృందం టీజర్ విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో మంచు మనోజ్ రైల్వే ట్రాక్ మధ్యలో నిలబడి కనిపించారు. ఆయనను వెనుక వైపు నుంచి చూపించడం ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలను బట్టి చూస్తే ఈ మూవీ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు అర్థమవుతోంది. టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమాపై మరింత అంచనాలు పెరిగే అవకాశం ఉంది. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్లపై భరత్ మోతుకూరి, వెంకట్ రెడ్డి నల్లాగంగుల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



# శాటిలైట్.. ఓటీటీ డీల్ క్లోజ్?

ఆర్ఆర్ఆర్ తర్వాత రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ చెంజర్ చిత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేక బాక్స్ ఆఫీస్ దగ్గర నిరాశపరిచింది. ఆ తర్వాత రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబోలో తెరకెక్కిన పెద్ది ప్రస్తుతం భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై అభిమానుల్లో మంచి హైప్ నెలకొంది. ఇప్పటికే ఈ చిత్రానికి భారీ స్థాయిలో థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే రూ.160 కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి.

ఇదే సమయంలో ఈ మూవీ శాటిలైట్, ఓటీటీ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వస్తున్న సమాచారం ప్రకారం ఈ సినిమా శాటిలైట్ హక్కులను జీ సంస్థ సొంతం చేసుకున్నట్లు, ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. థియేటర్ రన్ పూర్తైన కొన్ని వారాల తర్వాత ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానుండగా, అనంతరం కొన్ని వీక్స్ కి జీ తెలుగు ఛానెల్‌లో టెలికాస్ట్ కానున్నట్లు సమాచారం.

అయితే ఈ డీల్స్‌పై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్ నిర్మించగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించారు. ఇందులో రామ్ చరణ్ కి జోడిగా జాన్వి కపూర్ నటించింది.



# అందుకే మీడియాకు ధూరంగా ఉన్న

'నేను శైలజ' చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చి, 'మహానటి' సావిత్రి బయోపిక్‌తో జాతీయ అవార్డును అందుకున్న నటి కీర్తి సురేష్. కెరీర్ ప్రారంభంలో కాస్త బొద్దుగా, ముద్దుగా కనిపించిన ఈ మలయాళ బ్యూటీ.. ఇటీవలి కాలంలో బాగా సన్నబడి కనిపించడంతో ఆమె లుక్‌పై రకరకాల కామెంట్లు వచ్చాయి. కొందరైతే ఆమె లైపోసక్షన్ లేదా బేరియాట్రిక్ సర్జరీ చేయించుకుందని పుకార్లు పుట్టించారు. ఈ పుకార్లకు చెక్ పెడుతూ కీర్తి సురేష్ తన వర్కవుట్ వీడియోతో పాటు ఒక సుదీర్ఘమైన ఎమోషనల్ పోస్ట్‌ను షేర్ చేశారు.

తమ అందాన్ని కాపాడుకోవడానికి హీరోయిన్లు పడే కష్టాన్ని వివరిస్తూ.. '2013లో నేను నటిగా కెరీర్ ప్రారంభించినప్పుడు జిమ్ అనేది నా కోసం కాదు అనుకున్నాను. కానీ 2018లో 'మహానటి' సినిమా తర్వాత వచ్చిన విరామంలో నా శరీరంపై దృష్టి పెట్టాలనుకున్నాను. హై ప్రొటీన్, లో కార్బ్ డైట్‌తో పాటు హెచ్ఐఐటీ, కార్డియో వ్యాయామాలు తీవ్రంగా చేశాను. అలా కష్టపడి 9 నెలల్లో 10 కిలోల బరువు తగ్గాను. కానీ, ప్రజలు నన్ను చూసి 'చాలా వీక్‌గా అయిపోయావు' అనడమే కాకుండా.. 'సర్జరీలు చేయించుకుంది' అని మాట్లాడటం నన్ను తీవ్రంగా బాధించింది. నేను నా ముఖానికి, శరీరానికి ఎప్పుడూ నేచురల్ పద్ధతులనే పాటిస్తాను. నా కష్టమంతా ఇలా ఒక కత్తి (సర్జరీ) ఖాతాలోకి వెళ్ళిపోవడం చూసి బాధేసింది. తొలిరోజుల్లో కేవలం కార్డియో మాత్రమే చేయడం వల్ల నా కండరాలు కోల్పోయి బాగా సన్నగా కనిపించా. ఆ తర్వాత 2020 లాక్‌డౌన్ సమయంలో యోగా వైపు మళ్లాను. అది నాకు మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రస్తుతం నా దినచర్యలో యోగాతో పాటు స్ట్రెంత్ ట్రైనింగ్, యానిమల్ ఫ్లో, కాలిస్థెనిక్స్ వంటి వ్యాయామాలను సమతుల్యం చేసుకుంటూ హెల్తీగా ఉన్నా' అని స్పష్టం చేశారు.

అలాగే జనాల మనస్తత్వంపై స్పందిస్తూ.. 'నేను లావుగా ఉన్నప్పుడు సన్నబడమన్నారు.. కష్టపడి సన్నబడిన తర్వాత పాత లుక్కే బాగుంది, ఇప్పుడు బాలేదంటున్నారు. అసలు ఈ ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో అర్థం కాక కొన్నిసార్లు ఆశ్చర్యమేస్తుంది' అని కీర్తి చెప్పుకొచ్చింది. అయితే గత కొన్ని నెలలుగా తాను మీడియాకు, సినిమాలకు కాస్త దూరంగా ఉండటానికి గల కారణాన్ని కూడా కీర్తి బయటపెట్టారు. ఇటీవల తాను శారీరకంగా, మానసికంగా కొన్ని ఎదురుదెబ్బలను ఎదుర్కొన్నానని, అందుకే విరామం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఆమె డెడికేషన్‌కు నెటిజన్లు ఫిదా అవుతూ సపోర్ట్‌గా నిలుస్తున్నారు.

# దిల్ రాజు పెద్ద మనసు

## పావలా శ్యామలకు అండ.!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎన్నో విలక్షణమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన సీనియర్ నటి పావలా శ్యామల ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో, అత్యంత దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఆమెను చేర్చుకోవడానికి ఒక కార్పొరేట్ ఆసుపత్రి నిరాకరించడం కలకలం రేపింది. ఆ తర్వాత ఫుట్‌పాత్‌పై దిక్కుతోచని స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన స్థానికులు, పోలీసులు మానవత్వంతో స్పందించి, ఆర్కే ఫౌండేషన్ సహకారంతో కూకట్‌పల్లిలోని ప్రసాద్ హాస్పిటల్‌కు తరలించారు.

తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న పావలా శ్యామలను ప్రసాద్ హాస్పిటల్ వైద్యులు తక్షణమే ఎమర్జెన్సీ వార్డుకు తరలించి అత్యవసర చికిత్స ప్రారంభించారు. ఈ వార్త మీడియా, సోషల్ మీడియా ద్వారా బయటకు రాగానే ప్రముఖ టాలీవుడ్ నిర్మాత దిల్ రాజు తక్షణమే స్పందించారు. శ్యామల ఏ ఆసుపత్రిలో ఉందో తన మేనేజర్ల ద్వారా వెంటనే ట్రేస్ చేయించిన ఆయన, ప్రసాద్ హాస్పిటల్ వైద్యులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పావలా శ్యామల గాల్‌బ్లాడర్ (పిత్తాశయం) తీవ్ర సమస్యతో బాధపడుతున్నారు. దీనికి తోడు ఆమె శరీరంలో అబ్డామినల్ క్రియాటినిన్ స్థాయిలు ప్రమాదకరంగా పెరిగాయని, అలాగే వృద్ధాప్య భారంతో పాటు గుండె సంబంధిత సమస్యలు కూడా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ఆమెకు తల నుంచి పూర్తి స్థాయి స్కాన్‌లు, 2డి ఈసీఓ వంటి పలు కీలక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది వెల్లడించారు.



పావలా శ్యామల దయనీయ స్థితిని చూసి చలించిపోయిన నిర్మాత దిల్ రాజు.. ఆమెకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను తానే భరిస్తానని ప్రకటించి పెద్ద మనసు చాటుకున్నారు. శ్యామల ఆరోగ్య విషయంలో ఎలాంటి వెనకడుగు వేయకుండా, అత్యంత మెరుగైన చికిత్స అందించాలని ఆయన ఆసుపత్రి వైద్యులకు విజ్ఞప్తి చేశారు. దిల్ రాజుకు సంబంధించిన మేనేజర్లు నిరంతరం ఆసుపత్రి సిబ్బందితో సంప్రదింపులు జరుపుతూ, శ్యామల పూర్తిస్థాయిలో కోలుకునే వరకు ఆమెకు అండగా ఉంటారని స్పష్టం చేశారు. కష్టకాలంలో ఒక సీనియర్ నటిని ఆదుకోవడానికి దిల్ రాజు ముందుకు రావడం పట్ల సినీ పరిశ్రమ వర్గాలతో పాటు నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.